క్లుప్తంగా

వాకర్స్ ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించాలి



సన్మానం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

బెల్లంపల్లి: క్రీడాకారులు, వయో వృద్ధులు, వాకర్స్ ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించాలని డాక్టర్ రవి వర్మ అన్నారు. బెల్లంపల్లి తిలక్‌స్టేడియంలో వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రోజువారీగా నడక సాగించడం వల్ల జీవనాడులు సమర్థవంతంగా పనిచేస్తాయని, రక్త సరఫరా మెరుగు పడుతుందన్నారు. తద్వారా రోజంతా ఉల్లాసంగా ఉండటానికి వీలవుతుందని వివరించారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ నిర్వాహకులు రవి వర్మకు శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రాజం, రంగరామన్న, నాగేష్‌కుమార్, జయరాం యాద వ్, రాజ్‌కుమార్ గరిగే, కందుల రాజు, రవి, అయిలయ్య, నగేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న స్నేహితులు

మంచిర్యాలటౌన్: వారంతా కలిసి 35ఏళ్ల క్రితం కలిసి చదువుకున్నారు. కానీ అందులో ఓ స్నేహితుడు అవదూత కమలాకర్ మంచిర్యాల పట్టణంలో నివాసం ఉంటుండగా, ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు కలిసి ఆదివారం బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి రూ.1.75 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో బాల్య మిత్రులు సురేందర్ రెడ్డి, కాశీనాథ్, సంజయ్ ప్రకాశ్, దేవేందర్ రెడ్డి, శోభన్ రెడ్డి, రమణారెడ్డి, భోజ రెడ్డి, అశోక్, చంద్రమోహన్, జగన్మోహన్, సమ్మన్న పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత

కాసిపేట: మండలంలోని దుబ్బగూడం గ్రామానికి చెందిన ఓరం కార్తీక్ కొన్ని సంవత్సరాల క్రితం ప్రమాదంలో గాయపడ్డాడు. నడవలేని స్థితిలో ఉన్నాడు. కాగా అతడికి ఆదివారం కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీల్ చైర్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాజీ సర్పంచ్ వేముల కృష్ణ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో నాయకులు సత్తార్, కనుకుల రాకేష్, మధు పాల్గొన్నారు.

ఆనంద నిలయానికి చేయూత

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయం(అనాధ పిల్లలు, వృద్ధుల ఆశ్రమం)కు ఆదివారం పట్టణంలోని న్యాయవాది గోలి కృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద నిలయానికి రూ.9వేల నిత్యావసర సరుకులను గోలి శృతి, కృష్ణ దంపతులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శృతి మాట్లాడుతూ పిల్లలకు, వృద్ధులకు ఎలాంటి వైద్య సేవలనైనా ఉచితంగా అందించేందుకు తాను సిద్ధంగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, కార్యదర్శి చందూరి మహేందర్ పాల్గొన్నారు.

వలస కూలీ మృతి

మంచిర్యాల క్రైం: బతుకు దెరువు కోసం మంచిర్యాలకు వలస వచ్చిన వలసకూలీ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. లక్సెట్టిపేట మండలం చింతపల్లి గ్రామానికి చెందిన అక్కల తిరుపతి(65) కొద్ది రోజుల క్రితం మంచిర్యాలకు వలస వచ్చి నూతనంగా నిర్మిస్తున్న భవనాల వద్ద వాచ్‌మెన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడన్నారు. ఆదివారం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నుంచి నడుచుకుంటూ వస్తుండగా అస్వస్థతకు గురై మృతి చెందాడన్నారు. మృతుడి సోదరుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

జూలై 7న కులవివక్ష వ్యతిరేక సదస్సు

పాతమంచిర్యాల: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా సదస్సును జూలై 7న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో ఆదివారం జిల్లా సదస్సు నిర్వహణ సన్నాహక సమావేశం నిర్వహించారు. 7న నిర్వహించే సదస్సుకు జిల్లాలోని దళితులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాజేశం, జిల్లా కమిటీ సభ్యులు నానయ్య, దమ్మాల రాములు, జుమ్మిడి కుమార్ పాల్గొన్నారు.

మురుగునీరు తొలగించండి



మురుగునీటిలో బోరుపంపు మోటారుపైపులు

కోటపల్లి: మండలంలోని కొల్లూర్ గ్రామపంచాయతీలో చేతిపంపు బోర్ చుట్టూ బురద నీరు చేరి దోమలకు ఆవాసంగా మారింది. కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు పేర్కొన్నారు. ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న బోరు చుట్టూ మురుగునీరు చేరి పైపులు మురుగు నీటిలోనే ఉండటంతో లీకేజీ వల్ల మురుగునీరు పైపులతో నీటిలో చేరుతుందని, దీంతో రోగాలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరు చుట్టూ చేరిన మురుగునీటిని తొలగించి శుభ్రం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కన్నెపల్లి తహసీల్దార్ కార్యాలయం

ఆధార్ కేంద్రం లేక అవస్థలు..!


భీమిని: అన్ని ప్రభుత్వ పథకాలకు ఆధార్‌కార్డు అవసరం కాగా కన్నెపల్లి మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు బెల్లంపల్లి పట్టణానికి వెళ్లి అవస్థలు పడుతున్నారు. ఆధార్‌లో ఏ చిన్న తప్పిదం ఉన్నా, దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. దీంతో అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేయాలన్నా, ఆధార్ కార్డులో అడ్రస్ ఫొటో, పేర్లలో తప్పులు మార్పు చేయాలంటే పదేపదే ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కన్నెపల్లి మండలానికి ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రమా.. క్రీడా ప్రాంగణమా?

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆవరణలోనే తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఆరోగ్య కేంద్రం ప్రధాన ద్వారం ఎదుట ఏర్పాటు చేసిన బోర్డుపై పెద్ద, పెద్ద అక్షరాలతో తెలంగాణ క్రీడా ప్రాంగణమని రాసి ఉంది. దీంతో ఇది క్రీడా ప్రాంగణమా, ఆరోగ్య కేంద్రమా అని అడగాల్సిన పరిస్థితి నెలకొంది.



ప్రారంభమెప్పుడో..!



అద్దె ఇంటిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం



నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఒక కేంద్రం శిథిలావస్థలో ఉన్న ఇంటిలో కొనసాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వం రూ.12లక్షలు మంజూరు చేయగా, గతేడాది అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనాన్ని నిర్మించారు. కానీ ఇప్పటికీ ప్రారంభించలేదు. దీంతో పాత ఇంటిలోనే కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న ఇంటిలో కేంద్రం నిర్వహిస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పిల్లల తల్లిదండ్రులు భయపడతున్నారు. వెంటనే నూతన భవనాన్ని ప్రారంభించాలని వారు కోరుతున్నారు.

అగ్గి రాజుకుంటే బూడిదే..!



గత సంవత్సరం నవంబర్ నెలలో కాలిపోయిన ప్రభుత్వ కళాశాల భవనం

- లక్సెట్టిపేట మండలానికి దూరంగా ఫైర్‌స్టేషన్లు
- సకాలంలో చేరుకోని ఫైరింజన్లు
- అగ్ని ప్రమాదం జరిగితే తీవ్రస్థాయిలో నష్టం
- స్థానికంగా ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్

లక్సెట్టిపేట: జిల్లా పరిధిలో మంచిర్యాల, జన్నారం, బెల్లంపల్లి, చెన్నూర్‌లో నాలుగు ఫైర్ స్టేషన్‌లు ఉన్నాయి. కానీ అగ్నిప్రమాద సమయంలో లక్సెట్టిపేట మండలానికి ఫైరింజన్లు చేరుకోవడానికి గంటకు పైగా సమయం పడుతోంది. దీంతో తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లుతోంది. మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి లక్సెట్టిపేట మండల కేంద్రానికి 26కిలో మీటర్ల దూరం ఉండగా, ఫైరింజన్ రావడానికి దాదాపు 40నిమిషాల సమయం, జన్నారం 37కిలో మీటర్ల దూరం ఉండగా 50నిమిషాల సమయం, బెల్లంపల్లికి 50కిలో మీటర్ల దూరం ఉండగా, గంటన్నర సమయం, చెన్నూర్ 65కిలో మీటర్ల దూరం ఉండగా, దాదాపు రెండు గంటల సమయం పడుతోంది. లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మూడు మండలాలు జన్నారం ఫైర్‌స్టేషన్ పరిధిలోకి వస్తుండగా, ఏదైన అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఫైరింజన్ రావడానికి దాదాపు గంట సమయం వేచిచూడాల్సిన పరిస్థితి వస్తుండగా, అప్పటికే భారీగా ఆస్తినష్టం జరుగుతోంది. అగ్నిమాపక కేంద్రం లక్సెట్టిపేట కేంద్రంగా ఏర్పాటు చేయాలనే ప్రజల కోరిక కలగానే మిగిలిపోతోంది.

ఏర్పాటుపై అలసత్వం..

గతంలో నియోజకవర్గంగా ఉన్నప్పటి నుంచి లక్సెట్టిపేటకు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారు. ఎంతోమంది నాయకులు ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఫైర్‌స్టేషన్ నిర్మాణం చేయలేకపోతున్నారు. ప్రతీ అగ్నిమాపక కేంద్రానికి ఒక్క ఫైరింజన్ మాత్రమే ఉండగా, దానిలో నీరు అయిపోయినట్‌లైతే మళ్లీ వెనక్కి వచ్చి నీటిని నింపుకొని వెళ్లాల్సి ఉంటుంది. నీరు అందుబాటులో లేకుంటే మంటలు ఆర్పడం సాధ్యం కాదు. అగ్నిమాపక కేంద్రానికి రెండు ఫైరింజన్‌లు ఉంటే మంటలు ఆర్పడానికి సులువుగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు సుమారు ముప్పైకి అగ్ని ప్రమాదాలు జరిగినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని మండలంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అగ్నిప్రమాదాలు...

- లక్సెట్టిపేట మండల కేంద్రంలోని మహాలక్ష్మివాడకు చెందిన మేడి నారాయణ పొలం సాగు చేసి గడ్డివాము పొలం వద్ద ఉంచడంతో ప్రమాదవశాత్తు కాలిపోగా సుమారు రూ.యాభై వేలు ఆస్తి నష్టం జగిరింది.
- లక్సెట్టిపేటలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో అగ్నిప్రమాదం సంభవించడంతో వాహనం వచ్చే సరికి రూ. లక్షల ఆస్తి కాలిబూడిదైంది.
- దండేపల్లి మండలం మాదాపూర్‌కు చెందిన శనిగారపు లక్ష్మి నివాస గృహం ప్రమాదవశాత్తు కాలిపోవడంతో సుమారు రూ. ఐదు లక్షల నష్టం వాటిల్లింది.
- లక్సెట్టిపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం ఆకస్మాత్తుగా కాలిపోవడంతో, నూతన భవనాన్ని నిర్మాణం చేస్తున్నారు.
- ఎస్‌బీఐ ఊత్కూరు బ్రాంచిలో అగ్ని ప్రమాదం జరగడంతో రికార్డులు మొత్తం కాలిపోయాయి. ఇలా వరుసగా గ్రామీణ ప్రాంతాల్లో గడ్డి వాములు, పూరిళ్లు, పట్టణంలో షార్ట్ సర్క్యూట్‌తో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా ప్రజల ఆస్తి, ప్రభుత్వ ఆస్తులు కాలిబూడిదవుతున్నా ఫైర్‌స్టేషన్ మాత్రం ఏర్పాటు చేయడం లేదు.

ప్రతిపాదనలు పంపించాం

అగ్ని మాపక కేంద్రం అందుబాటులో ఉంటే ప్రమాదాలను త్వరగా అరికట్టవచ్చు. దూరం కావడంతో ఫైరింజన్ వచ్చే సరికే ఆస్తినష్టం జరుగుతోంది. అగ్నిమాపక కేంద్రం కోసం ప్రతిపాదన పంపించాం. ఇంకా మంజూరు కాలేదు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సమాచారం రాగానే వెంటనే వాహనాలను పంపిస్తున్నాం. అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. సమీపంలో ఫైర్‌స్టేషన్‌లు ఉంటే అగ్రిప్రమాదాలను నివారించవచ్చు.

– అజయ్‌కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి

క్రికెట్ క్లబ్ క్రీడాకారుల ఆత్మీయ సమ్మేళనం



విజయసంకేతం చూపుతున్న క్రికెట్‌క్లబ్ క్రీడాకారులు

తాండూర్: క్రికెట్ క్లబ్ క్రీడాకారులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు సూరం రవీందర్ రెడ్డి అన్నారు. మాదారం టౌన్‌షిప్‌లోని లాల్‌బహదూర్ క్రీడా మైదానంలో ఆదివారం క్రికెట్ క్లబ్ ఆత్మీయ సమ్మేళనాన్ని పురస్కరించుకొని మాదారం సింగరేణి పాఠశాల మొదటి బ్యాచ్ క్రీడాకారులు ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదారం ప్రాంతంలో గతంలో బొగ్గు గనులు ఉండటంతో, ఈ ప్రాంతం కార్మికులు, క్రీడాకారులతో కళకళలాడుతుండేదన్నారు. మాదారం టౌన్‌షిప్‌లో నివాసం ఉన్న యువకులు ఎక్కువగా క్రీడలపై ఆసక్తిని పెంచుకొని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించి పేరు తెచ్చుకున్నట్లు గుర్తు చేశారు. అన్ని రకాల ఆటలపోటీలు జరుగుతుండేవని, మాదారం టౌన్‌షిప్‌కు క్రీడాకారులు ఎంతో మంచి పేరు తెచ్చారని పేర్కొన్నారు. క్రికెట్ క్లబ్ తరఫున ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. క్రీడలకు నిలయమైన మాదారం టౌన్‌షిప్‌ను క్రీడాకారులు మరిచిపోకుండా గుర్తు పెట్టుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. అంతకు ముందు సీనియర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రశంసించారు. క్రీడాకారులు తరలివచ్చి గతించిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



దండేపల్లి: టపాసులు కాల్చుతున్న బీజేపీ నాయకులు



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

దండేపల్లి: కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టడంతో పాటు, భారత ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా దండేపల్లిలో బీజేపీ నాయకులు ఆదివారం రాత్రి సంబురాలు నిర్వహించారు. బస్టాండ్ వద్ద టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్, రవీందర్, సురేష్, మల్లేష్, గురువయ్య, గంగధర్, తులసీ, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో బీజేపీ శ్రేణుల బైక్ ర్యాలీ

చెన్నూర్: పట్టణంలో భారతీయ జనతా పార్టీ నాయకులు అయ్యప్ప స్వామి ఆలయం నుంచి కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, గాంధీచౌక్ మీదుగా ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మూడోసారి అధికారం చేపట్టడమే కాకుండా ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా విజయోత్సవ ర్యాలీని నిర్వహించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ప్రతాప్ మారుతీ హనుమాన్ మందిర్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారాన్ని తిలకించేందుకు డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతి, వెంకటేశ్వర్ గౌడ్, వెంకటనర్సయ్య, కేవీఎం శ్రీనివాస్, శివకృష్ణ, గణేశ్‌సింగ్, సురేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కళా యాత్రికుడికి స్వాగతం



మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో ఘన స్వాగతం పలికిన మంచిర్యాలవాకర్స్ అసోసియేషన్ సభ్యులు

చెన్నూర్: దేశ వ్యాప్త కళాయాత్ర ముగించుకుని స్వగ్రామం చెన్నూర్‌కు వస్తున్న చిత్ర కళాకారుడు ఏల్పుల పోచంకు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో మంచిర్యాల వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు, ఉపాధ్యాయుడు కొర్లల్ల రాంరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘన స్వాగతం పలికారు. అనంతరం పోచంను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసమే అన్న ప్రజా కవుల బాట లో చెన్నూర్‌కు చెందిన పోచం లైవ్ డ్రాయింగ్ యా త్ర నిర్వహించడం సంతోషదాయకమన్నారు. 2017లో సుదీర్ఘంగా ఏడేళ్లపాటు కళా యాత్ర నిర్వహించి విజయవంతం చేశారని పేర్కొన్నారు. పో చంను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. మంచి ర్యాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: జిల్లాకు చెందిన లైవ్ డ్రాయింగ్ వేసే కళాకారుడు ఏల్పుల పోచం దేశంలోనే మొట్టమొదటిసారి కళాయాత్రను చేసి, లైవ్ డ్రాయింగ్స్ వేస్తూ, తిరిగి ఆదివారం మంచిర్యాలకు చేరుకున్న సందర్భంగా జిల్లా కళాకారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. 2017లో తన కళాయాత్రను కాశ్మీర్ టు కన్యాకుమారి పేరిట మొదలుపెట్టగా, ఇటీవలే ముగిసింది. రైలులో మంచిర్యాలకు రాగా, రైల్వే స్టేషన్ వద్దనే పోచంకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పూదరి ప్రభాకర్, తిరుపతి, బద్రి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, గంగాధరి రాజు, మల్లేశ్, తోట సదానందం, రాజు, కుర్మా రాజేశ్వర్ గౌడ్, బోయిని మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

మోదీ ప్రమాణ స్వీకారోత్సవ పూజలు



గోవింద క్షేత్రంలో పూజలు చేస్తున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారత ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేస్తున్నందునా, ఆయన సేవలు యావత్ భారతావనికి మరింత ఉన్నతంగా అందాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆదివారం హాజీపూర్ మండలం గుడిపేట గోవింద క్షేత్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పక్షాన నిలిచి భారీ మెజారిటీ అందించి నరేంద్రమోదీకి మూడోసారి పట్టం కడుతున్న నేపథ్యంలో ప్రధానిగా మోదీ దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేలా తగిన శక్తి, సామర్థ్యాలను ఆ దేవుడు ప్రసాదించాలని పూజలు నిర్వహించారు. పూజల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి, హాజీపూర్ మండల అధ్యక్షుడు గద్దం స్వామిరెడ్డి, యువమోర్చ జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్వినిరెడ్డి, నాయకులు వెంకటరమణారావు, సత్యనారాయణ, ప్రశాంత్, మల్లేశ్, వెంకటరెడ్డి, రాజనర్సు, సతీశ్, ప్రమోద్‌కుమార్, శ్రీనివాస్, రాఘవులు పాల్గొన్నారు.

నక్కలపల్లి మారెమ్మ జాతర

కోటపల్లి: మండలంలోని నక్కలపల్లి గ్రామంలో ఈ నెల 10, 11 తేదీల్లో మారెమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 10న అమ్మవారి బోనాలు, 11 రథయాత్ర జరుగుతుందని తెలిపారు. అమ్మవార్లకు గంగజలాలతో అభిషేకంతో జాతర ప్రారంభమవుతుంది. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలని ఆలయ పూజారి కోరారు.

ఆధ్యాత్మికం

లక్ష్మీదేవి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో క్యూకట్టిన భక్తులు

జన్నారం: మండలంలోని చింతగూడ శ్రీ లక్ష్మీదేవి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మంచిర్యాల జిల్లాతో పాటుగా వివిధ జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున వచారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూకట్టారు. తలనీలాలు, ముక్కు, చెవులను కుట్టించడం లాంటి శుభకార్యాలను కూడా ఆలయంలో జరిపించారు. భక్తులు బోనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

ఎల్లారం పోచమ్మకు మొక్కులు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామపంచాయతీలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానిక గుండాల వద్ద పుణ్యస్నానం ఆచరించి నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. కోళ్లు, మేకలు బలిచ్చి మా ఇంటిల్లిపాదిని సల్లంగా చూడాలి తల్లి అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాల్లోని చెట్ల కింద వంటావా ర్పు చేసుకొని విందు భోజనాలు ఆరగించారు.

మదనం పోచమ్మ ఆలయంలో వేలం

చెన్నూర్: పట్టణంలోని మదునం పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 11న ఉదయం 11 గంటలకు కొబ్బరికాయలు, పూజ సామగ్రి, శీతల పానియలు, కిరాణ సామగ్రి, ఆట వస్తువులు అమ్ముకునేందుకు బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మదాయ శాఖ ఈవో రవి తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.50వేల దరావత్తు సొమ్ము చెల్లించాలని తెలిపారు. వేలంను సొంతం చేసుకున్న వారికి ఏడాది పాటు కాల పరిమితి ఉంటుందన్నారు.